కవికొండల వెంకటరావు




"సీక్రెట్ ఆఫ్ సక్సెస్ ఈస్ పుష్" అనేది అనుభవానికి వచ్చే దొక్క 'పార్కు ఫేర్'లోనే. అందులోనూ ఆట లయిపోయి జనమంతా యివతల కొక్కమాటు పడి బేడ బేడ టిక్కెట్లు కొనుక్కొని లోపలకు దూరాలనుకుంటూ వుంటారే ఆ నాలుగైదుగంటల మధ్య సాయంకాల మప్పటి 'పుష్షూ' చూడాలె. 'ఓషన్ ఆఫ్ మెన్' 'మెన్'తో పాటు 'విమెన్' 'మెన్ అండ్ విమెన్'తో పాటు 'ఛిల్డ్రిన్' అంటే చివరకు తేలేది కుటుంబాల సముద్రం అల్లల్లోలం హడావిడీ అసహ్యించుకోవడాలు, ఆ వెంటనే హాహాలు హీహీలు, ఆశ్చర్య పోవడాలు, అను నసుకోవడాలు!!!

పది రూపాయల టిక్కెట్లుకూడా వచ్చినయియేమో, పంగిడిగూడెపు జమీందారు వేటకు తీసుకు వెళ్ళే చిఱుత పులి విడివడ్డట్టు, తెనుఁగు దేశపు మొనగాళ్లంతా కోర మీసాలగాళ్లు, కుచ్చు పాగాలవాళ్లు, వార గోచీలవాళ్లు, మింగ మెతుకులు లేకపోయినా రంగేళీ కేం కొదవ అనే రకంగాళ్లు, కావలసినంత మంది పోలోమని కనిపించేరు.

ఒకటి రెండు మూడు దాటి ఆ గుంపులో నాలుగోవాణ్ణి చూడండి! 'హీ ఈస్ ఎ ట్రెమెండెస్ ఫెలో!'

అత నెప్పుడూ తన వూరు పిడిచిపెట్టి యెరుగడనుకుంటాను. పల్నాటి మనిషిలాగున్నాడు. అందులోనూ కొంచెం టెక్కుగాడల్లే కూడా తోస్తాడు. అయినా మదరాసు రిక్షావాలాల ముందు జట్కా వాలాలముందు వాడి టెక్కేం పని కొస్తుంది? తాగుడు వాసనతో ఒక రిక్షావాలా ముందుకు నెట్టితే, ఆతగాడు పాపం ఒక జట్కావాడి చేతుల్లోని చెమటకమిచీ దెబ్బ తినేటంత అవస్థకు వచ్చేసేస్తున్నాడు. కాని ఆ టెక్కుగాడంత బాధ పడుతూవున్నా కళ్ళను మాత్రం 'స్పార్కిలింగు'గా త్రిప్పుతూ పట్నంలోని సౌందర్యం, సహవాసం, సాహసం, సరసం,

సౌఖ్యం, అంతా యిక్కడే యీ పార్కుఫేర్‌లోనే వుందన్నట్టు చూపుల్లో చూపులు మిళావ్ కానిస్తున్నాడు.

If life has a purpose—If life has no purpose—రెండిందాలాకూడా విమర్శించొచ్చు ఆ మహా సాంఘిక తీర్థాన్ని. కొంత డబ్బు ఖర్చు పెడతాం, కొన్ని కొన్ని చూస్తాం, ఇవతలకు వస్తాం, 'ఆఫ్టరాల్' ఏమందె చూడ్డాని కంటాం. కాని 'పర్పస్ ఆర్ నో పర్పస్' మనవాడున్నాడే మహానుభావుడు 'పెర్ఫ్యూమరీ బూత్' దగ్గర అగరుపుల్ల పుచ్చుకు వాసన చూస్తూ, ఫర్నిచర్ అమ్మే 'స్పెన్సర్సు బూత్'లో నిలువుటద్దం ప్రక్కనున్న 450 రూపాయల 'స్ప్రింగు కాట్' మీాదా చతికిలబడి కూలంకష ప్రజ్ఞ తన చూడ్కుల్లో విరజిమ్మేస్తున్నాడు.

దయచేసి, పాఠకురాలా! పొరబాటు_పాఠకులారా! కథలో ఇంతవఱకు వ్రాసింది మొదటి ఛాప్టర్‌గా భావించండి. ఈ పైది రెండో ఛాప్టర్.

చెన్నపట్నం అనేది అసలు ఆంధ్రుల పట్నం అని చరిత్రకారు లీ మధ్య ఘట్టిగా ఉద్ఘోషిస్తూ వున్నారు. కాని ఎంత ఉద్ఘోషించినా ఆ పట్నంలో వున్న భాగ్యవంతులంతా చెట్టియారీలు అవడంచేతా ఉద్యోగస్థులంతా అయ్యంగార్లవడంచేతా 'ఐమీాన్' మహాభాగ్యవంతులూ, గొప్ప ఉద్యోగస్థులూ, ఆ ఉద్ఘోష పైకిప్పట్లో వినవచ్చేటట్టు లేదు. కాని ఆంధ్రుడు మాత్రం చెన్నపట్నం తనదే అన్నట్టు, కనబడకుండా, అలుముకుపోతూ వున్నాడు. కొత్తగా పట్నంలోకి వచ్చిన ఆంధ్రుడు వెఱ్ఱికోనంగి చూపులు చూచినా, పాబడ్డ ఆంధ్రుడు మాత్రం దబాయించుకుపోతూ వున్నాడు, తన సొంతవూరురా మదరాసన్నట్టు. ఎలాగన్నా పైకి వద్దామనీ మదరాసు ఏల్దామనీ తంటాలు పడుతూవున్నాడు.

ఆలా తంటాలు పడకపోతే వానికిక గత్యంతరంకూడా లేదేమో? ఉత్తరాన్ని ఒరిస్సా కని చెప్పి కొంత ఆంధ్రాన్ని ఉత్కలంలో కలిపివేసిన తరువాత, తిరిగీ ఆంధ్రరాష్ట్రం ప్రత్యేకంగా తయారవుతుంది అని నే ననుకోను. ఏమైనా, ఉత్కలాంధ్రం ఉత్తరాన్ని విజృంభిస్తే మదరాసాంధ్రం దక్షిణాన్ని విజృంభించడమే అవశ్యంగా కనిపిస్తుంది.

ఇంత చిన్న కథలోకి ఈ రాజకీయం అంతా ఎందుకు తెస్తారు అప్రస్తుతం అని అనుకుంటారేమో? ఎన్నటికీ కాదు.—'ఛాప్టర్ ఛాప్టర్'గా వ్రాసేటప్పుడు ఏదీ అప్రస్తుతం కాదు చూడండీ! మొదటి ఛాప్టరులో నాయకుణ్ణి సూచించాను. రెండో ఛాప్టరులో వాడి కొక పరిస్థితి కల్పించాలా వద్దా? అటువంటి పరిస్థితికి రాజకీయ వాతావరణమో, సాంఘిక వాతావరణమో, చరిత్రాత్మక వాతావరణమో, పౌరాణిక వాతావరమో నాల్గింటి యొక్క సమ్మేళమో, మిడిమేళమో ఉండి తీరాలా వద్దా? ఇంత ఆలోచించి వ్రాసేటప్పుడు ఏదీ అప్రస్తుతం కానేరదు.

నాయకుడు ముందుకు చూపులు విరజిమ్మేస్తున్నాడు. కాని తన వెనక జరిగేది గ్రహించలేకపోతూ వున్నాడు. జరగటం అంటే ఒకానొక సంగతి జరగటం కాదు. ఒకానొక మనిషి, మనిషి వెనుక మనిషి, మనిషి ప్రక్క మనిషి, మనిషి ముందు మనిషి, (భగవదనుగ్రహంవల్ల

మనిషిమీద మనిషీ మనిషికింద మనిషీ ఉండడం కాదు) నిజంగా జరగటం—momentum— తన వెనక గల 'మొమెంటమ్' గ్రహించ లేక పోతూ వున్నాడు.

మూడో ఛాప్టర్. ఒక నికార్సు అయిన నిజమైన అందం గల ఆడమనిషి, అంత ఎత్తరికి ముద్దిచ్చే హాసు, ఇంత కౌగిలి కమిరే శేవ, ఎంతకైనా చెప్పొచ్చే యావనం, కుడి బుజం మీద కాస్చిన పమిటె, ఎడం పిక్కమీదకు జార్చిన కుచ్చె, నొసట కొంచెం కుంకుమ, ముక్కున నెక్కిన అర్ధచంద్రిక, చెవులను ధగద్ధగాయమాన సుకాంతి వెలిగ్రక్కే వజ్రాల కమ్మలు, ఒంటిది బంగారు చాయ, కంటిది రంగారు మాయ, Most delicately to be handled lady!

[పద్యము] [ఈల] [రాగం] [హార్మనీ] [తబలా] చనుకొనగోట మీటు నెడ, చట్టన, చట్టలు, పుల్కరించి, సెప్పని నును సిగు దొంతరల ప్రాలున దవ్విరిబోణి——[స్టాప్]

[చనుకొనగోట—మూడు పాఠాంతరాలకు బ్రివిటీ చనుకొన గోట, చను కొనగోట, చను కొన కొనగోట]

ఆమె ప్రక్కనే "ఇనే ఫైల్ విత్ హెర్" ఒక నల్లని బొండులంద మగవాడు తన పొట్టను కోటు వొత్తిడి కుంయి కుంయి మనిపిస్తూవుంటే, జరీ మడత కండువాను నిశ్శబ్దం అంటూ జరుగుతున్నాడు. స్త్రీపాత్రా పురుషపాత్రాకూడా ఈ క్రొత్త పాత్రలు ఆంధ్రమహాశయుణ్ణి చూచుకోకుండా పోతూవున్నారు. వాడి వీపున విఱగబడ్డట్టు పడిపోయినారు.

తొల్త డివైన్ జ్యోతిని అర్ధ నారీశ్వరరూపం తగిలిందో అని అనుకొని మళ్లీ టెర్రెస్ట్రియల్ ప్లేనుకు దిగి, తనను అంత ఘట్టిగా ముందుకు నెట్టేది అరవలని అనుభవ ప్రవృత్తిని సమర్థించుకొన్నవాడై "ఓరి! మీయింట బటారంగాను. ఈ మదరాసు మీ కోసమే పుట్టలేదర్రా! మా కోసమూ పుట్టింది. కొంచెం నిదానించుకు నడవండి. ముందున్నాం ఆంధ్రులం!" అని జగజెట్టీ కనక మెడ అలసట తీర తిప్పికొన్నట్టు కుడికీ ఎడమకూ తిప్పికొన్నాడు.

కుడితట్టుకు చూచేసరికి 'కామెడీ' (comedy) లాగు సుందరి! ఎడంతట్టుకు చూచేసరికి 'ట్రాజెడీ! (tragedy) లాగు కాకిరూపు ఖరదూషణుడు.

చాలా సేపటివఱకూ ఏం తోచలేదు మన ప్రేక్షకుడికి. ఇటు కామెడీ అటు ట్రాజెడీ అని అనుకుంటుంటే ఎనుబోతులాంటి మనిషి మగపాత్ర గొంతెత్తి, "మీ చెవి కమ్మల 'డైమండ్సు' మా అంగడిలో ఎత్తినవే సుమండీ!" అన్నాడు. సుందరి "ఆఁ!" ఇంత కాంతి గల వజ్రాలమ్మిన అంగడి మీదేనా?'' అంది.

ప్రేక్షకున కప్పుడు పార్కు ఫేర్ యొక్క ఉద్దేశ్యం బోధపడింది. అన్యోన్యం తెలిసికోవాలని తహతహపడే మానవులయొక్క Comic figures నీ tragic figures నీ కూడా కలపోసి కలగూర గంప గావించి తెలుసుకునేటట్టు చేస్తుంది అని అనుకొన్నాడు. Comedy లేదు tragedy లేదు all one body అనే జ్ఞానం సంపాదించుకున్నాడు.

••••••••••••••••